# పెంపుడుకుక్క

"ఏదో విధంగా దాని ప్రాణం తీస్తే తప్ప ఇక ఈయింట్లో మనం సుఖపడలేమండి. రేపే ఏదైనా పట్టుకురండి. ఏ పాలల్లో అయినా కలిపి తాగించేస్తే దాని పీడా విరగడవుతుంది."

రాత్రి పదిగంటల వేళ రహస్యం చెపుతున్నట్లుగా అంది సునీత భర్తతో.

"చేతనైతే కష్టంలో ఉన్నవాడిని కాపాడే ప్రయత్నం చెయ్యాలి గానీ బలవంతంగా ఓ నిండు ప్రాణం తీసేసే హక్కు మనకు లేదు" అని అనలేదు అతను భార్యతో.

ఆమె చెప్పిందానికి 'అలాగే' అన్నాడు.

"అసలే మీకు మతిమరుపు ఎక్కువ రేపుగానీ.... మరచిపోయేరు. ఆ పాడు కుక్కతో నేను వేగలేను బాబూ!"

"జ్ఞాపకంగా తెచ్చేస్తాలే! చూడు రేపీపాటికి ఆ కుక్క పని సరి" హామీ ఇచ్చేడు సుందర్.

ఆ కుక్క ప్రాణం పోతుందని హామీ ఇచ్చేక సునీత ప్రాణం కుదుటపడింది.

ఇంతకీ వాళ్లు ప్రాణం తీయాలనుకుంటున్న కుక్క పిచ్చెక్కి తిరుగుతూ కనపడ్డవాళ్లందర్నీ కరిచేసి ప్రాణాలకు ముప్పు తేవటం లేదు. పోనీ.... ఆ కుక్క అలా ప్రాణనష్టం చేస్తుంటే దాని ప్రాణం తీయాలి అన్న వాళ్ల ఆలోచన రావటానికి కారణం ఓ వారం రోజులుగా ఆ కుక్క వాళ్లింటికి అలవాటుపడటం. అశ్రద్ధగా సునీత వీధి తలుపు తీసి ఉంచేస్తుంది కనుక ఆ కుక్క లోపలికి రావటం అకలితో ఉన్న ఆ ప్రాణి వంటపదార్థాలను తినేయటం మాత్రమే! జాగ్రత్తగా తలుపువేసి ఉంచుకోకపోవటం 'తనతప్పు' అని అనుకోలేదు సునీత. ఆ కుక్క అలా ఇంట్లోకి వచ్చేసినపుడల్లా వండిన పదార్థాలు ముట్టేసుకున్నప్పుడల్లా.... తన చేతికి అందుబాటులో ఉన్న ఏ వస్తువైనా తీసుకొని అమానుషంగా బాదేస్తుంది ఆ కుక్కని.

అలాంటప్పుడు సుందర్ చూసినా 'అదేమిటి సునీ! దాన్ని బయటికి తరిమేసి తలుపేసుకుంటే పోయేదిగా' అనవసరంగా బాదేయటం ఎందుకు?' అని అనడు. పైగా భార్య చర్యని సమర్థిస్తాడు. ఆ అమాయకపు జంతువు కాసేపు బాధతో మొరిగినా మళ్ళీ....

అకలికి తాళలేక మూయని తలుపు తనకు అడ్డురాదు కనుక మళ్ళీ మళ్ళీ లోపలికి వచ్చేస్తుంది. ఇలా ఓ నాలుగు రోజులు జరిగేసరికి సునీత ఈ నిర్ణయం తీసుకుంది.

అసలు అప్పటినుంచి భర్తతో చూచాయగా అంటూనే ఉంది. సుందర్ అందుకు అంగీకరించడేమో అన్న భయం ఆమెను సూటిగా చెప్పనివ్వలేదు. కానీ.... ఈ రోజు ధైర్యం చేసింది. తన నిర్ణయం భర్తకు చెప్పేసింది. భర్త అంత తేలికగా అంగీకరించటం ఆమెకు అమితానందాన్నిచ్చింది.

భార్యకిచ్చిన వాగ్దానాన్ని నిలుపుకోలేకపోయాడు. నిజంగానే ఘరునాడు కుక్క ప్రాణం తీయటానికి ఉపయోగపడే విషపదార్థం తీసుకురావటం మరచిపోయాడు సుందర్.

సునీత చీదరించుకుంది. 'చీ!చీ! నా మాటే అసలు మీకు విలువ లేదు. రాత్రి ఎంత ఖచ్చితంగా చెప్పారు! ఇప్పుడు తీసుకురావటం మానేసారు. అన్నింటికి ఒకటే మంత్రం మీకు 'మరచిపోయాను' అని అతి సుళువుగా అనేస్తారు'.

"సారీ! సునీ! రేపు తప్పక తీసుకవస్తాగా !"

"నిన్న అన్నారు 'ఈ తప్పక' వెటకరిస్తున్నట్లు అంది ఆమె స్వరం.

"కాదు సునీ? ఈ రోజు కూడా దానికి ఆయుష్షు ఉందేమో! పాపం బ్రతకనీ ఈ ఒక్క రోజు. రేపెలాగు దాని ఆయువు చెల్లి పోతుందిలే!" సుందరం భోంచేసి మళ్ళీ ఆఫీసుకి బయల్దేరాడు.

సునీత ఏదో గుర్తుకొచ్చినా దానిలా వీధిలోకి పరెగెత్తి "పీలైతే

సాయంత్రమే తీసుకొచ్చేయండి. ఆ కుక్కతో దినదిన గండంలా వుంది" అంది.

'అలాగే అన్నట్లు' తల ఊపి సుందర్ స్కూటర్ స్టార్టు చేశాడు.

'అలవాటు ప్రకారం తలుపు వెయ్యకుండానే లోపలికి వెళ్ళి కునుకు తీస్తోంది సునీత। ఆ అమాయక ప్రాణి, మనుషుల కుయుక్తులు తెలియని ఆ అల్పజీవి మళ్ళీ ఆ ఇంటికి వచ్చి ఖాళీ గిన్నెలే నాకుతూ వంటిల్లు చిందరవందర చేస్తోంది. ఆ అలికిడికి ఉలిక్కిపడిన సునీత పట్టరాని కోపంతో వంటింట్లోకి వెళ్ళింది. సునీతను చూసేసరికి భయపడిన కుక్క పారిపోవటానికి ప్రయత్నించింది. కవ్వం పుచ్చుకొని పారిపోతున్న కుక్కను కొట్టసాగింది. కుక్క భయంతో వీధిలోకి దారితీసింది. దాన్ని తరుముతూ వెంట వెళ్లింది సునీత.

మధ్యాహ్నం వేళ కావడంతో రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. కుక్క కంగారుగా పరిగెడుతోంది. సునీత ఊహకందని దృశ్యం ఆమె కళ్లముందు జరిగింది. అటువైపుగా వస్తున్న ఓకారు చక్రాల క్రిందపడి మరుక్షణమే ఆ కుక్క తన ప్రాణాలు పోగొట్టుకుంది. ఆ సమయానికి ఆ వైపుగా వచ్చిన నల్గురైదుగురు మనుష్యులు ఆ దృశ్యాన్ని చూసి నిలబడిపోయారు. రక్తంతో పడిఉన్న ఆ నోరులేని ప్రాణిని చూస్తుంటే వాళ్లమనసులు ద్రవించేయి. సునీత మాత్రం తన కోరిక ఇంత చిత్రంగా తీరినందుకు ఆనందించింది.

మరుక్షణం ఆమెలో మెరుపులాంటి ఊహ అంతే। ఆమె తన చేతులో ఉన్న కవ్వాన్ని బలంగా ఇంటిలోపలికి విసిరేసి గబగబా

కారు దగ్గరకు వచ్చేసింది. లేని శోకాన్ని ముఖానికి పులుముకుని, ఆనందబాష్పాన్ని దుఃఖాశ్రువులుగా మార్చింది.

"అయ్యయ్యో! ఎంత పని జరిగిపోయింది. మా ప్రాణ సమానమైన "పెంపుడుకుక్క" ఇది. దుఃఖాన్ని అభినయించింది.

అప్పటికే కారు దిగిన పెద్దమనిషి ఖంగారు పడ్డాడు.

"కాస్త ముందు, వెనకా చూస్కోనఖర్లే! పిల్లలకన్నా ఎక్కువగా పెంచుతున్నారేమో దీన్ని....పాపం నోరులేని జంతువని కర్కశంగా మీ కారుచక్రాల క్రింద నలిపేసి దాని ప్రాణాలు తీశారు. ఆవేదన నటిస్తూ ఇలాటి పదునైన మాటలనెన్నింటినో ఉపయోగించింది. చుట్టూ మనుష్యులు అవిడ్ని ఓదార్చి అతనిని మందలించారు.

సునీత కళ్లు తుడుచుకుంటూ "ఇప్పుడు మరోజాతి కుక్కను కొనితెచ్చుకోవాలి. అందుకోసం పోనీ నష్టపరిహారమైన ఇవ్వమనండి".

సునీత మాట అందరికీ సబబుగా తోచింది. కారుగల వ్యక్తికైతే భయాన్ని కల్గించింది, మళ్ళీ ఏ చిక్కుల్లో ఇరుకోవాల్సి వస్తుందో నన్న భయంతో తన జేబులోంచి పర్సు తీసి కొన్ని ఐదు వంద రూపాయల కాగితాలు సునీతకు ఇచ్చేశాడు.

నోట్లు లెక్కపెట్టుకొని 'ఈ మాత్రానికి మంచి కుక్క ఎక్కడ దొరుకుతుందయ్యా నిజానికి నువ్వు ఎంత ఇస్తే మాత్రం మా కుక్క సాటి!" అనలేదు.

తను ఏ కుక్క ప్రాణాలు తీయాలనుకుందో ఆ కుక్క ప్రాణం పోయిన తర్వాత పెంపుడుకు కుక్కైే ఈ విధంగా ఉపయోగ పడింది' అనుకుంటూ సంతోషంగా లోపలికి వెళ్లిపోయింది. ●